పేదల బతుకులు నేలమట్టం



చిరు వ్యాపారులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు

- చిరు వ్యాపారుల కడుపులు కొడుతున్న కూటమి ప్రభుత్వం
- ఎటువంటి సమాచారమివ్వకుండా సీతమ్మధారలో దుకాణాల తొలగింపు
- సామగ్రి తీసుకునే సమయం కూడా ఇవ్వలేదని బాధితుల ఆవేదన
- నష్ట పరిహారం చెల్లించాలని కె.కె.రాజు డిమాండ్



సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రాంతంలో నేలకూల్చిన బడ్డీలు



పొక్లెయిన్‌తో బడ్డీలను తొలగిస్తున్న సిబ్బంది

తాటిచెట్లపాలెం: కూటమి ప్రభుత్వంలో పేదల బతుకులు నేలమట్టమవుతున్నాయి. చిరు వ్యాపారుల జీవనాధారమైన బడ్డీలు, దుకాణాల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. మూడో రోజు శనివారం సీతమ్మధార ప్రాంతంలోని పలు బడ్డీలు, వ్యాపారాలను పొక్లెయిన్, లారీలతో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది తొలగించారు. ఓట్లు వేసి గెలిపించినందుకు తమ కడుపులు కొట్టి తగిన శాస్తి చేశారంటూ కూటమి ప్రభుత్వాన్ని పలువురు మహిళలు దుయ్యబట్టారు. ఇది చాలా అన్యాయమని, ఎన్నో ఏళ్లుగా చిరు వ్యాపారాలనే నమ్ముకుని తమ కుటుంబాలు జీవిస్తున్నాయని, ఇంతవరకూ ఎవరూ ఇలా పేదలపై విరుచుకు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బాధితులకు కె.కె.రాజు సంఘీభావం

సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ పక్కన శనివారం సాయంత్రం జీవీఎంసీ అధికారులు బడ్డీలను తొలగించడం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆ ప్రాంతానికి చేరుకుని చిరు వ్యాపారులకు సంఘీభావం తెలిపారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ ధోరణి మార్చుకోవాలని, ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా జీవీఎంసీ అధికారులు ఉన్నపళంగా బడ్డీలను తొలగించడం అన్యాయమని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణం వీరికి ప్రత్యామ్నాయం చూపించాలని, వీరికి నష్టపరిహారం కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. స్థానిక కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజు, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, యూత్ వింగ్ జోనల్ ప్రెసిడెంట్ అంబటి శైలేష్, పార్టీ నాయకులు తాడి జగన్నాథరెడ్డి, నాగేశ్వరరావు, జీలకర్ర నాగేంద్ర, ముర్వల సంతోష్, పి.హరి, కె.సత్యనారాయణ, అప్పలరాజు, నవీన్, సంఘ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

తొలగింపులు వెంటనే ఆపాలి: ఏఐటీయూసీ

గ్రేటర్ విశాఖ పరిధిలో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని జీవిస్తున్న వారిపై స్మార్ట్ సిటీ పేరుతో జీవీఎంసీ, సచివాలయం అధికారులు పోలీసుల సహాయంతో చేస్తున్న తొలగింపు ప్రక్రియను వెంటనే ఆపాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ డిమాండ్ చేశారు. ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా రోడ్డు మీద వ్యాపారులను దౌర్జన్యంగా తొలగించడం అన్యాయమన్నారు. చాలా మంది గుర్తింపు కార్డులు, ట్రేడ్ లైసెన్స్‌లు కలిగి చిల్లర పన్నులు కూడా చెల్లిస్తున్నారని, ఇపుడు తమకేమి సంబంధం లేనట్లు జీవీఎంసీ అధికారులు వ్యవహరించడం దారుణమన్నారు. సుప్రీం కోర్టు నిబంధనలను కూడా పక్కనపెట్టి ఇలా ఇష్టానుసారం ప్రవర్తించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ విషయమై అధికారులు సానుకూలంగా స్పందించకపోతే సోమవారం అన్ని ప్రాంతాల వారితో కలిసి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని పడాల రమణ హెచ్చరించారు.



సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ పక్కన జీవీఎంసీ సిబ్బంది నేలమట్టం చేసిన బడ్డీలు

చిరు వ్యాపారులపై ప్రతాపం

- కంచరపాలెం – ఊర్వశి జంక్షన్ రహదారుల్లో దుకాణాల తొలగింపు
- రోడ్డున పడ్డామంటూ బాధితుల ఆవేదన

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధి 54, 56 వార్డుల్లోని కంచరపాలెం నుంచి ఊర్వశి జంక్షన్ రహదారిలో ఆక్రమణల తొలగింపు చేపట్టారు. టౌన్ ప్లానింగ్ ఏసీపీ తిరుపతిరావు, టీపీవో ప్రవీణ్‌కుమార్‌ల పర్యవేక్షణలో సిబ్బంది శనివారం ఉదయం 9 గంటల నుంచి ఉత్తర నియోజకవర్గ పరిధి ఊర్వశి కూడలి జాతీయ రహదారి నుంచి కంచరపాలెం ముత్యమాంబ ఆలయం వరకు, మధ్యాహ్నం పశ్చిమ నియోజకవర్గంలోని కంచరపాలెం నేతాజీ కూడలి నుంచి ఊర్వశి జంక్షన్ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆయా మార్గాల్లో ఫుట్‌పాత్, రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలు, టీ, షాప్ కౌంటర్లు, డిస్‌ప్లే బోర్డులు, దుకాణాల మెట్లు, షాపుల ముందు ఐరన్ గ్రీల్స్, షెడ్లను తొలగించి.. చిరు వ్యాపారులపై తమ ప్రతాపం చూపారు. ఉన్నపళంగా తమ జీవనాధారమైన దుకాణాలను తొలగించడంతో రోడ్డున పడ్డామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ డ్రైవ్‌లో టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, చైన్‌మెన్లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, మహిళా పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



పొక్లెయిన్‌తో బడ్డీలు తొలగిస్తున్న సిబ్బంది

జీవనోపాధిపై దెబ్బకొట్టారు



సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రాంతంలో 30 ఏళ్లుగా చిన్న చికెన్ వ్యాపారం చేసుకుంటున్నాం. 2014లో ఈ ప్రాంతాన్ని హాకర్స్ జోన్‌గా ప్రకటించి మాకు నంబర్లు కూడా జీవీఎంసీ అధికారులు కేటాయించారు. ఇపుడు హఠాత్తుగా మా బడ్డీలు తొలగించడం అన్యాయం. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా మా జీవనోపాధి మీద దెబ్బకొట్టారు.
– వేములవలస అప్పారావు, హాకర్స్ జోన్ ప్రెసిడెంట్, సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రాంతం

రోడ్డున పడేయడం దారుణం



25 ఏళ్లుగా ఈ ప్రాంతంలోనే పాత పేపర్లు, స్క్రాప్ షాప్ నిర్వహిస్తున్నాం. మా పిల్లలు ఇక్కడే పుట్టి పెరిగారు, ఈరోజు ఉన్నపాటున మమ్మల్ని రోడ్డున పడేయడం దారుణం. గతంలో ఏ ప్రభుత్వం ఇటువంటి చర్యలు చేపట్టలేదు. మాకు ప్రత్యామ్నాయం చూపించి, సమయం ఇవ్వాలి కదా. ఇలా ఉన్నపళంగా దుకాణాలు తొలగిస్తే.. మేం ఎలా బతికేది? ఇళ్ల అద్దెలు చెల్లించేది ప్రభుత్వమే చెప్పాలి.
– కల్లూరి రాంబాబు, స్క్రాప్ దుకాణ యజమాని

ఉన్నపళంగా బడ్డీలు తొలగిస్తే బతికేదెలా..?



20 ఏళ్లుగా ఎస్ఎఫ్ఎస్ స్కూల్ పక్కనే చిన్న బడ్డీ ఏర్పాటు చేసుకుని పాన్‌షాప్ నిర్వహించుకుంటున్నాం. ఈరోజు మధ్యాహ్నం ఉన్నపళంగా మా సామగ్రి కూడా తీసుకోనివ్వకుండా బడ్డీలపై జీవీఎంసీ అధికారులు ప్రతాపం చూపించారు. మాకు జరిగిన అన్యాయంపై ఇంతవరకు ఏ ప్రజాప్రతినిధి స్పందించ లేదు. విషయం తెలిసిన వెంటనే కె.కె.రాజు గారు వచ్చి మాకు ప్రత్యామ్నాయం చూపించాలని, నష్టపరిహారం చెల్లించాలని మా తరఫున కోరారు.
– వెంకటలక్ష్మి, పాన్‌షాప్ నిర్వాహకురాలు

క్లుప్తంగా

అల్జీమర్స్‌పై అవగాహన అవసరం

తాటిచెట్లపాలెం: అల్జీమర్స్ (మతిమరుపు) గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, ఈ వ్యాధితో బాధపడే వారికి కుటుంబ సభ్యులు మద్దతుగా నిలవాలని సీతమ్మధార కిమ్స్ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ శైలేష్ మోదీ అన్నారు. సెప్టెంబర్ 21న ప్రపంచ అల్జీమర్స్ డేను పురస్కరించుకుని శనివారం ఆయన ఒక ప్రకటనలో పలు విషయాలు వెల్లడించారు. అల్జీమర్స్ అనేది మెదడుకు సంబంధించిన వ్యాధి అని, నెమ్మదిగా జ్ఞాపకశక్తి పోవడం, ఆలోచనలు, మాట్లాడటం, పనులు చేయడం ఇలా అన్ని విషయాల మీద ప్రభావం చూపుతుందన్నారు. ఇది కేవలం వృద్ధుల సమస్య మాత్రమే కాదని, పిల్లలు, కుటుంబాలు, ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం చూపించే అతిపెద్ద ఆరోగ్య సమస్యని పేర్కొన్నారు. అల్జీమర్స్ లక్షణాలను ముందుగా గుర్తిస్తే చికిత్స ద్వారా నెమ్మదిగా నియంత్రించవచ్చన్నారు. ఈ వ్యాధిని పూర్తిగా నివారించలేకపోయినా జీవనశైలిలో కొన్ని మార్పుల వల్ల 45 శాతం వరకు తగ్గించవచ్చని డాక్టర్ శైలేష్ తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం



పారిశుధ్య కార్మికురాలికి దుస్తులు అందిస్తున్న బీజేపీ నాయకులు

తాటిచెట్లపాలెం: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా శనివారం బీజేపీ నాయకులు 42వ వార్డులో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు గురుగోవింద్ సింగ్ ఆధ్వర్యంలో వార్డులో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులను బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక సన్మానించి, దుస్తులు అందించారు. కార్యక్రమంలో గిరిజ, ప్రకాష్ రెడ్డి, విజయానంద్‌రెడ్డి, రఘు, ఆడారి శంకర్, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఇంటరాక్ట్ క్లబ్ ప్రారంభం



ఇంటరాక్ట్ క్లబ్ నూతన సభ్యులతో రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని విశ్వతేజ స్కూల్‌లో రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ.. ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ విశ్వతేజ స్కూల్‌ను శనివారం ఘనంగా ప్రారంభించింది. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ బి.శివాజీ, ముఖ్య అతిథి పి.పి.జి.ఎ స్.రాజు 2025–26 సంవత్సరానికి గాను ఇంటరాక్ట్ క్లబ్‌కు నూతన కమిటీ సభ్యులను నియమించారు. క్లబ్ అధ్యక్షుడిగా ఎ.హర్షవర్ధన్(9వ తరగతి), కార్యదర్శిగా కె.మనోజ్ వెంకట్ సూర్యసాయి(9వ తరగతి), కోశాధికారిగా డి.జశ్వంత్(9వ తరగతి)తోపాటు వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీలను ఎన్నుకున్నారు. వీరంతా క్లబ్ తరఫున పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. విశ్వతేజ స్కూల్ కరస్పాండెంట్ ఐ.భాస్కరరావు, ప్రిన్సిపాల్ ఐ.సునీత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ పూజలు



అన్నప్రసాదం వడ్డిస్తున్న షణ్ముఖరావు

మర్రిపాలెం: విశ్వకర్మ జయంతి సందర్భంగా శనివారం ఘనంగా పూజలు చేశారు. మర్రిపాలెం ఎలక్ట్రికల్ లోకో షెడ్‌లో మహా అన్నదానం నిర్వహించారు. సీనియర్ డీఈ ఆర్ షణ్ముఖరావు పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది కార్మికుల సొంత ఖర్చులతో విశ్వకర్మ పూజ చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో సీనియర్ అధికారులు, కమిటీ సభ్యులు, సుమారు వెయ్యి మంది వరకు ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉద్యోగుల ర్యాలీ

మహారాణిపేట: హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమంపై జిల్లా పరిషత్ ఉద్యోగులు శనివారం జిల్లా పరిషత్ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. సీఈవో నారాయణ మూర్తి ఆధ్వర్యంలో ప్లానింగ్ విభాగాధికారి పీవీవీఎస్ మూర్తి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి డి.మంజువాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత పాటిద్దాం.. ఆరోగ్యంగా జీవిద్దాం



స్వచ్ఛతా వాకథాన్‌లో పాల్గొన్న డీఆర్ఎం లలిత్ బోహ్రా, రైల్వే అధికారులు

తాటిచెట్లపాలెం: ఉద్యోగులు, ప్రయాణికులు, ప్రజల్లో జాతీయ స్థాయి స్వచ్ఛతా ఉద్యమంపై అవగాహన కల్పించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ సహకారంతో వాల్తేర్ డివిజన్ సంభవ్ స్వచ్ఛతా–సంస్కార్ స్వచ్ఛతా నినాదంతో శనివారం వాకథాన్ నిర్వహించింది. డీఆర్ఎం లలిత్ బోహ్రా వాకథాన్‌ను ప్రారంభించి, స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతా అంటే కేవలం బాహ్య శుభ్రత మాత్రమే కాదని, దీనిని ఒక అలవాటుగా చేసుకొని ఆరోగ్యకరంగా జీవించాలన్నారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, భద్రతతో కూడిన మన ప్రయాణం కోసం మనమందరం కలిసి సాగడమే సంభవ్ స్వచ్ఛతా –సంస్కార్ స్వచ్ఛతా ఉద్దేశమని తెలిపారు. రైల్వే ఇండోర్ స్టేడియం నుంచి రైల్వే స్టేషన్ వరకు సాగిన ఈ వాకథాన్‌లో ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ మెకానికల్ ప్రవీణ్ భటి, సీనియర్ డివిజనల ఫైనాన్స్ మేనేజర్, స్పోర్ట్స్ ఆఫీసర్ ఎం.హరనాథ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కాలేజీ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాషా

మురళీనగర్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎం బాషా అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఆయన ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటిని దత్తత తీసుకుని పెంచాలని సూచించారు. అటవీకరణ ద్వారా పచ్చదనాన్ని పెంచడంతోపాటు దెబ్బతిన్న భూములను పునరుద్ధరించడం ద్వారా జీవవైవిధ్యాన్ని కాపాడవచ్చన్నారు. పర్యావరణాన్ని కాపాడుతామంటూ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కాలేజీ ప్రాంగణంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాలలోని వివిధ శాఖాధిపతులు, స్టూడెంట్ అడ్వైజర్, ఇతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ



సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ చేస్తున్న భక్తులు

సీతంపేట: లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు స్వామివారిని, ఉత్సవ మూర్తులను తులసీ మాలలు, చామంతులు, విరజాజులు, గులాబీలతో చూడముచ్చటగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి దర్శించి అభిషేకాలు, అర్చనలు చేశారు. ఉదయం సుప్రభాత సేవ, సాయంత్రం భక్తులు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ పఠించారు. అనంతరం విశేష హారతులిచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

28న పౌర ప్రజా సంఘాల సదస్సు

బీచ్‌రోడ్డు: మహాత్మా జ్యోతిబాపూలే సత్యసాధక సమాజ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా, సర్దార్ భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఈ నెల 28న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మనువాద కార్పొరేట్ ఫాసిజం మూలాలు–ప్రజా ఉద్యమ కర్తవ్యాలపై పౌర ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు పౌర ప్రజా సంఘాల సమన్వయకర్త పాత్రపల్లి చంద్రశేఖర్ తెలిపారు. సంబంధిత కరపత్రం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ప్రధాని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 ఏళ్ల కాలంలో దేశ ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతూ కులాల పేరుతో ప్రజలను మధ్యయుగం నాటి కాలానికి తీసుకువెళ్లే ప్రయత్నం విస్తృతంగా చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పలు సంఘాల ప్రతినిధులు నెయ్యిలా నాగభూషణరావు, లలిత, పద్మ, అనురాధ రామకృష్ణ, లక్ష్మీ తిరుపతి రావు, శివలక్ష్మి, జయ తదితరులు పాల్గొన్నారు

చిత్తశుద్ధితో విధుల నిర్వహణ

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ఉద్యోగులు నిర్ణీత సమయానికే విధులకు హాజరు కావాలని అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి ఆదేశించారు. శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కమిషనర్(ఫైనాన్స్) ఎస్ఎస్ వర్మతో కలిసి అన్ని జోన్ల కార్యాలయాల పర్యవేక్షకులు, జీవీఎంసీ ప్రధాన కార్యాలయ పర్యవేక్షకులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంకిత భావంతో పనిచేసి, ప్రజల మన్ననలు పొందాలన్నారు.

వైభవుడికి విశేష సేవలు



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం విశేష సేవలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్య నిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కాళీ కాలభైరవులకు రుద్రాభిషేకం



లలితా పీఠంలో కాళీ కాలభైరవులకు రుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు

సీతంపేట: మాస శివరాత్రి సందర్భంగా శనివారం అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో కాళీ కాళభైరవులకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పండితుల వేదమంత్రాల మధ్య రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అమావాస్య సందర్భంగా ఆదివారం ఉదయం 9 గంటలకు శ్రీప్రత్యంగిర భద్రకాళి హోమం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

ప్లాస్టిక్‌ను విడనాడుదాం



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేధిద్దామని వైశాఖి స్పోర్ట్స్ పార్క్ సభ్యులు పిలుపునిచ్చారు. పార్కు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం పార్కులో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపై వాకర్స్‌కు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించి, దాని వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. అనంతరం పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఎస్.రామకృష్ణ, కె.వెంకటరావు, ఎస్.శివసాగర్, ఉదయ్‌భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, వైశాఖి స్పోర్ట్స్ పార్కు కార్యదర్శి రాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని గిగ్ వర్కర్ల ధర్నా



డైమండ్ పార్క్ వద్ద ధర్నా చేస్తున్న స్విగ్గీ, జొమాటో రైడర్లు, యూనియన్ నాయకులు

సీతంపేట: తమ సమస్యలు పరిష్కరించాలంటూ స్విగ్గీ, జొమాటో రైడర్లు శనివారం నగరంలోని అక్కయ్యపాలెం, ద్వారకానగర్, డైమండ్ పార్క్, మధురవాడ, గాజువాక, ఎన్ఏడీ, పెందుర్తి సమీపంలో ధర్నా చేశారు. డైమండ్ పార్క్ వద్ద జరిగిన ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ రైడర్లు పాత జీతాలు ఇమ్మని అడుగుతున్నారని, ఇది న్యాయమైన కోరికని, యాజమాన్యాలు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జొమాటో సంస్థ ఈ ఏడాది రూ.974 కోట్ల లాభాలు ఆర్జించిందని, దాని వెనుక రైడర్ల కష్టం ఉందన్న విషయం మర్చిపోకూడదన్నారు. గిగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ జిల్లాలో 40 వేల మంది యువత ఏడేళ్లుగా స్విగ్గీ, జొమాటో వంటి ప్లాట్‌ఫారాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి ఉద్యోగ భద్రత, స్థిరమైన ఆదాయం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. అక్రమంగా తొలగించిన ఐడీలను పునరుద్ధరించాలని, 8 గంటలు ఆన్‌లైన్‌లో ఉంటే మినిమం గ్యారంటీ ఆదాయం చెల్లించాలని, గతంలో ఇచ్చినట్లు పీక్, నాన్ పీక్‌లు ఇవ్వాలని కోరారు. రైడర్‌కు సమస్య వస్తే పరిష్కరించే రిప్రజెంటేటివ్ కావాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.వి.నరసింహులు, విశాఖ క్యాబ్ యూనియన్ ఉపాధ్యక్షుడు సి.ఎం .శ్రీను, వెంకటేష్, మురళి, కె.ఎం.కుమార్ మంగళం , శ్రీనివాస్, అచ్యుత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సరికాదు



డాక్టర్ వడ్డాది మధుసూదనరావు

సీతంపేట: రాష్ట్రంలోని వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర రెల్లి కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వడ్డాది మధుసూదనరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రైవేట్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లు లభించే అవకాశాలు ఉండవని తెలిపారు. దేశ జనాభా 140 కోట్లకు పైగా ఉందని, కోవిడ్ కాలంలో చాలా సమస్యలు ఎదుర్కొన్నామని గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ వైద్య కళాశాలలు అవసరమని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

కలెక్టరేట్‌లో ఉచిత వైద్య శిబిరం

మహారాణిపేట: కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లీ హెల్త్ డొమైన్, లీ ఫార్మా లిమిటెడ్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్‌తో పాటు 147 మంది ఉద్యోగులు పరీక్షలు చేయించుకున్నారు. లీ ఫార్మా డైరెక్టర్ అల్లా లీలా రాణి, క్యాంప్ కో–ఆర్డినేటర్లు సరోజిని, జయలక్ష్మి, డాక్టర్ రాధిక, పోషకాహార నిపుణురాలు మాధురి, జి.ఎస్.ఎం. భాగ్యలత సేవలందించారు. జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, ఏవో బి.వి.రాణి, ఏపీఆర్ఎస్ఏ ప్రతినిధులు రాజేంద్రవర్మ, త్రినాథ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

